

## రాయసము వెంకటశివుడుగారు

౧

ఉదయగిరి రాజధానిగఁ జేసికొని, రెండవ జలాలుద్దీను మధ్యమాంధ్రరాష్ట్రి మేలుచుండెను. ఆమహమ్మదీయ ప్రభుని రాజ్యమందు జను లెవ్విధమగు ననర్థములకును బాలుగాక, సరిలేని సౌఖ్యసంపద లనుభవించుచుండిరి. హిందువులు, మహమ్మదీయులు నను తారతమ్యము లేక, ప్రజలందఱిని సమభావమున నవాబు పరిపాలించుచుండెను. జలాలుద్దీను సుజనులలో సుజనుఁడు. సుఫీసిద్ధాంతము లందపార భక్తి విశ్వాసములు గలిగి యుండు నాతనికి వానితోఁ దులతూఁగు హిందూవేదాంతశాస్త్రమునందును అమిత గౌరవము గలదు. అతని కన్నులకు బీదసాదలు, పండితపామరులు నందఱు నొకటియె. జగమంతయు జగదీశుని జీవకళయె. ప్రజలెల్లరు భ్రాతృసమానులు. పరమాత్మునియందు బుద్ధి నిలిపి, జలాలుద్దీను పూర్వకాలపు ప్రభువరులగు జనక, అరీలియసు, అక్బరు మున్నగు మహనీయుల పాదచ్ఛాయలనే యడుగు లిడుచు, దేశపరిపాలన ధర్మము నిర్వర్తించుచుండెను.


లోకవిభవము లన్నిటికన్నను జలాలుద్దీనునకు చిత్తశాంతియె ప్రియతమము. అనేక మాఱు లాతనికి భూలోకజీవనము, ప్రజాపరిపాలనమును నతిదుర్భరము లుగఁ దోఁచి, తా నీకష్టభూయిష్ఠమగు సంసారము వదలి, ఏమెక్కా-పుణ్యక్షేత్రమునకో, ఏషిరాజునగర వాటికకో చేరి, అందు పరమేశ్వర ధ్యానమందును, సుఫీ వేదాంతుల సుఖగోష్ఠిని దినములు గడపఁగోరెను. ఐనను, తమ్ముఁడగు నాదరుషా కొండవీఁడు ప్రభువై, అన్నకు సర్వదా సాయము చేయుచు, ఆతని మనసు నకాండవైరాగ్యము నుండి రాజకార్యనిర్వహణమునకుఁ ద్రిప్పుచు, ఉదయగిరి ప్రభుత్వ మతఁడు వీడకుండునట్లు చేయుచుండెను.

జలాలుద్దీను పారసీక రాజకుటుంబములోని యొక సుందరిని బరిణయమయ్యెను. ఆసుకుమారి హిందూస్థానమునకు వచ్చి కొన్ని వత్సరము లైనను, ఈదేశపు శీతోష్ణస్థితులకును, జనాచారపద్ధతులకును నభ్యాసపడ లేదు. ఆ ప్రాంతములకెల్ల నుదయగిరి యుద్యానవనమువంటిది. నడివేసవి యెండలు, దేశము నెంత దహించుచున్నను ఉన్నత పర్వతశిఖరమున హిమాలయమువలెఁ జల్లగ నుండు నుదయగిరి ఖిల్లాదరికి రాకుండును. ఆనగ రెంత సౌఖ్యావహముగ నున్నను, జులెయికా కాంత కను లెపుడును దూరపు షిరాజు వృక్షవాటికలమీఁదను, అందలి

పుష్పజాలముమీఁదను వాలియుండును! వసంతకాలమున నుదయగిరి తరు రాజముల నాశ్రయించు పికావళి పారసీకోద్యానముల నుండు గండుఁగోయిలలవంటివిగావని యూతరుణి తలంపు! హిందూదేశమ్మందలి శీతకాలపు లేయెండ ఆలేమకు గ్రీష్మాతపమువలె దుస్సహముగ నుండును! ప్రభుపత్ని సౌఖ్యసదుపాయముల కేమికొఱఁత వాటిల్లఁగలదు? ఆసుందరి కెటులైన హిందూదేశ నివాసము సుఖవంతముఁ జేయఁగోరి, నవాబు పారసీకమునుండి వివిధఫలపుష్పజాతుల మొలకలు తెప్పించి నాటించెను. నీటివసతిగల చల్లని యుదయగిరి నీచెట్లు వృద్ధినొందెను. కాని యెన్ని సౌఖ్యము లుంచినను, హిందూదేశ జీవనము కారాగృహవాసమని జులెయికారాణి యనుకొనుచు, నానాఁటఁ గృశింపఁజొచ్చెను. వ్యాకులిత హృదయమున జనన మొంది, దేహమున వ్రేళ్లువాఱిన యానిత వ్యాధి నేవైద్యులును బరిశీలింపలేకుండిరి. ఎట్టి పర్పతులు, లేహ్యములు నాసుకుమారి శరీరపువేఁడిమి నుపశమింపఁజేయ నేరకుండెను. యునానిహకీములు, ఆయుర్వేదభిషగ్వరులును ఆరాజ్ఞికొఱకుపయోగించిన రాజౌషధములు అడవిని గాచిన వెన్నెలలైపోయెను! జలాలుద్దీను మనశ్శాంతికి విఘాతము కల్పించుటకు ప్రియసతిశరీరాస్వస్థత ప్రబలకారణ మయ్యెను!

## ౨

అద్దంకి సీమ నొక ప్రఖ్యాత వైద్యవంశము గలదు. ఇరువదియైదు సంవత్సరముల ప్రాయముగల శ్రీనాథుఁడను యువకుఁ డావంశపువారిలో నిపుడు నతికెక్కిన వైద్యుఁడు. వంశక్రమానుగతమైన వైద్యవిద్యానైపుణ్యముతోపాటు, ఈతఁడు ఉద్గ్రంథ పఠనము చేసి, దైవభక్తిపరుఁడై, పరోపకార చింతనము గలిగి, తనయొద్దకు వచ్చిన రోగుల జాడ్యపుజాడలు మిగుల మెలఁకువతోఁ బరిశీలించి, శ్రద్ధతోఁ దన్నివారణోపాయము లారయుచుండును. కావున వయస్సునఁ బిన్నవాఁడైనను, శ్రీనాథుఁడు అనుభవమునఁ బెద్దవాఁడె! ఎంతటి కఠినరోగమైనను, ఆవైద్యశిఖామణి చేఁకి లొంగవలసినదె! ఉదయగిరీశ్వరుని భార్యయొక్క వ్యాధి సమాచారము తెలిసి, మిత్రుల ప్రేరేపణమువలన, ఆరాణి రోగనివారణార్థమై యాతఁ డిలు బయలుదేఱెను. ఈ వైద్యుని బుద్ధికుశలతను గుఱించి మంత్రులవలన విని, నవాబు ఈతని మిగుల సత్కరించి, వైద్యము చేయింపఁ గోరి, ఖిల్లాపరిసరముల నుండెడి కదళికావనమునందలి భవనము నీతనికి విడిది చేసెను. మహమ్మదీయులలో ఘోషాపద్ధతి యుండుట లోకవిదితము. రాజకుటుంబములలో నీమరియాద మఱింత ప్రాముఖ్యము వహించియుండును. రోగిని జూడక, నాడీపరీక్ష వలనుపడక, ఇతరులు తెలిపెడి రోగచిహ్నములను బట్టి వ్యాధి నిర్ధారణచేయుట ఎట్టి వైద్యునికిని దుస్సాధ్యము. అనివార్యములగు ప్రతిబంధములఁ గూర్చి యను



“క్రిందనుంచిన పన్నీరుతొట్టెలో రాణి ముఖప్రతిబింబము......
...వ్యాధి నిరూపణము చేయఁబోయెను.”

కొన నేమి ప్రయోజనము? బాల్యమున శ్రీనాథుఁడు తండ్రియొద్ద వైద్యవిద్యాభ్యాసము చేయు దినములలో, రాజాంతఃపురస్త్రీల నాడీపదాన మెట్లు కనుఁగొనవలెనని యడిగి, రోగుల ఛాయాప్రతిఫల సందర్శనమువలన రోగనిర్ధారణము చేయు విధ మాయనవలన గ్రహించెను. ఇపు డది శ్రీనాథుఁడు జ్ఞప్తికిఁ దెచ్చుకొని, నవాబునకుఁ దెలియఁబఱచెను. అంత నంతఃపురమున రోగిమంచముదగ్గఱ నొక తెర వేయించిరి. క్రింద నుంచిన పన్నీరుతొట్టెలో రాణి ముఖప్రతిబింబము స్పష్టముగఁ గానవచ్చెను. ఈ నీడను బరీక్షించి వైద్యుఁడు వ్యాధి నిరూపణము చేయఁ బోయెను. శ్వేతకమలమువంటి రాణి ముఖబింబము పండుటాకువలె నగుట, కనుకొనలందు నీలిమ మేర్పడుట, కనులు సోలుచుండుట, శిరము తూలుచుండుటయు రోగమునకు ముఖ్య చిహ్నము లగునట్లు అతఁడు కనిపెట్టెను. వైద్యుని కోరికవలన నవాబు వేసిన ప్రశ్నములకు రాణి ప్రత్యుత్తరము లొసంగెను. ఆసంభాషణ మూలమున రోగికంఠధ్వని, ధోరణి, రుచులు, పరిస్థితులును దేటపడెను. ఇవ్విధమున నావైద్యుఁడు పరీక్షజరిపి, రోగనిర్ధారణచేసెను.

౩


లోకము విరోధివర్గ పరిపూరితము! గురువునకు గురువు, వైద్యునికి వైద్యుఁడు, వర్తకునికి వర్తకుఁడు శత్రువులుగ నేర్పడుచున్నారు. ఒకరి నొకరు ద్వేషించి, వలనుపడుచో నొకరి నొకరు అటవీమృగములవలె కబళింపఁ జూచుచుందురు! అంతియ కాని, మిత్రత్వమె వ్యాపారసూత్రముగఁ జేకొని, ఒండొరుల భావానుభవముల సాహాయ్యమున జనులు తమవిధులను మఱింత బాగుగ నెఱవేర్చుట కర్తవ్యమని గ్రహింపకున్నారు. శ్రీనాథుని ప్రణాళిక యిట్టిది కాదు. రోగనిర్ధారణము పట్ల వైద్యునికి సర్వజ్ఞత్వము పనికిరాదు. రోగి కిదివఱకు వైద్యము చేసినవారు భిషక్కునకుఁ బరమమిత్రులని యాతని మతము. కావున శ్రీనాథుఁడు రాణి పూర్వపుచికిత్సకుల పరిచయముచేసి, రోగనివారణమును గూర్చి వారు సలిపిన కృషివివరము, వ్యాధినిగుఱించి వారికిఁగల యనుభవములను గ్రహించెను. శిశువులకును, రాణివాసపు వారికిని వైద్యముచేయుట మిగుల కష్టము. పరదేశజనిత యగు జులెయికా కాంతయొక్క తనూలత్వ మతికోమలము. మనోవ్యథచే నేర్పడిన మహామేహమునకు వైద్యులు చేసిన ప్రతిక్రియలె వ్యాధిని మఱింత పెంచెను! బంగరుత్రాసువంటి యాసుకుమారతత్వమునకు కలకండపలుకె కఫోద్రేకము, మధుబిందువె మేహాధిక్యమును గలుగఁజేయును! ఈవిషమ పరిస్థితులందు మిగుల శ్రద్ధ వహించి, తన మేధాశక్తినంతయు నుపయోగించి, శ్రీనాథుఁ డట్టకేలకు ఔషధానుపాన నిర్ణయము చేసెను.

౪

దైవానుగ్రహమువలన వైద్యకుమారుని మందు రాణికి గుణ మిచ్చుచుండెను. నిరతము పానుపు నంటిపెట్టుకొని యుండు జులెయికా యిపుడు పరిచారికల సాయమున లేచి కూర్చుండి సంభాషింపఁ దొడఁగెను. సతి యిట్లు క్రమముగ నారోగ్యాభివృద్ధి గాంచుచుండుటకు ప్రభువు ముద మందెను. పుత్రిక యమితానంద భరిత యయ్యెను. పరిచారికలు ప్రసన్నవదనములతోఁ బనులు చేసికొనుచుండిరి.

శ్రీనాథుఁడు ప్రాతఃకాలమున నె దేవునికి పూజలు సమర్పించుచుండు వాఁడు. కదళికారామమున వలసిన పూవు లతనికి లభించుచుండునవి కావు. పెద్దకంచె కావల నేమైన పూలు చిక్కునేమోయని యొకనాఁడు వేకువ నచటికిఁబోయి, యాతఁడు మొగి మెత్తి చూచెను. అనేక జాతుల పుష్పలతిక లక్కడఁ గానవచ్చెను. అందొక నూతనరమణీయకుసుమ మతని కనులకుఁ దట్టెను. అరుణకమలముల కోమలత్వమందు మూర్తీభవించినటు లుండెను! ఆకృతిని పద్మమునకంటెఁ జిన్నదయ్యును, అందమున దానికంటె నిది మిన్నగఁ దోఁచెను! అంత నావిప్రకుమారుని కింకొక యద్భుత దృశ్యము గానవయ్యెను. నవమల్లికల నపహసించు మేనిసోయగమున నొప్పెడి పదు

నాలుగువత్సరముల బాల యొకతె పొదరింట్లలో నడచి వచ్చి, యీనూతనపుష్ప మొకటి కోసి, అరుణిమమందు దాని కెనయగు తనకోమలపాణితలమునఁ బట్టి సంతస



"నవమల్లికల నపహసించు మేనిసోయగమున నొప్పెడి......
సంతసమున నాఘ్రాణించుచుండెను."

మున నాఘ్రాణించుచుండెను. ఆసుందరి చెక్కులు, పెద వులు నరుణకాంతుల నలరారుచుండెను. ఆ మెలఁత మృదులాంగకముల నిర్మాణ రహస్యము లోకమున కెఱిఁగింప గుణపాఠముగ నుపకరించుటకె ధాత యీసుకుమార సుమముల సృజించెనా యనునటు లుండెను! ఈలలన నవాబు కుమారీరత్నమగు గుల్ నారియె!

శ్రీనాథుఁడు గుల్ నారిని జూచుట కిది మొదటి సారి కాదు. నాఁడు రాజాంతఃపురమున పన్నీటఁ గాన వచ్చిన రోగి కొకప్రక్కగ నిలుచుండి నగిపీఁకోడ కాను కొనియుండు నొక బాల ప్రతిబింబ మాతని కనుల కపుడు గోచరించెను. అట్టి సుకుమార సుందరరూపము మానవ భామినులలో నుండునని తలంపక, అతి శ్రద్ధగ నుండెడి తన నయనముల భ్రమింపఁ జేయుటకు ఏ గంధర్వాంగనయొ మానవాకృతి దాల్చి వచ్చెనని యాయువకుఁ డూహించెను! ఆకనులతీరు, మొగముసౌరు, పలుపరున క్రమము, ముంగురుల కాంతులు నీక్షించి, ఈ జవ్వని దేవాంశ సంజనితయగు వనితయని యావిప్రకుమారుఁడు విభ్రాంతి నొందెను! ఇపు డా సుందరాకారము మరల వాని కన్నులకుఁ బ్రసన్నమగునపుడు, ఈ కామిని మర్త్యలోక నివాసిని గావచ్చునని యొకింత విశ్వసించి నను, రాణి సన్నిహిత బంధువర్గములోనిదై యుండనోపునని యాయువకుఁడు తలపోసెను. ఏలనో వాని మది గురుతింపఁజాలని మెత్తని తాఁకునకు గుఱియయ్యెను. అతి సూక్ష్మరోగాంకురములు నరహస్యముగ శరీరమునకుఁ గావించిన యుపకృతి గనిపెట్టిన దిట్టరి, గుల్ నారినిగూర్చి తలంచునపుడు, తనహృదయసీమను కొల్లగొను కామచోరుని జాడలు పరికింప నేరకుండెను!

మోహ మెపుడు నొకప్రక్కనె ప్రసరించునని భావించుట మానవుల వెఱ్ఱి! అద్దంకినీపు వైద్యుఁడు ఖిల్లాలోఁ గాలు పెట్టి, తనజనని చికిత్సకుఁ బూనిననాఁటి నుండియు, గుల్ నారి యాయువకునందు సదభిప్రాయమున నుండెను. బ్రహ్మతేజస్సున నొప్పెడి యావయస్యుని వదన పద్మమును అంతఃపుర గవాక్షములనుండి యాపొలఁతి పలుమారు పొడగాంచియుండెను. బుద్ధికౌశల్యమునకు నీడుజోడగు నయనంపదయు, ప్రజ్ఞాధికత కెనయగు సహృదయతయు ఆజవ్వనుని మోముదమ్మిని తమ్మిచూలి లిఖియించినట్టుగ గుల్ నారికి నయనగోచరమయ్యెను! అనుభవశాలులు,వయోవృద్ధులు నగు ఘనవైద్యుల చేతులకుఁ జిక్కని వ్యాధి యీయువకునకుఁ దెల్లమగునాయని పలువు రనుకొన్నను, వీనికే యీరోగము గ్రాహ్యమగునని నమ్ముచు, వీనికే జయము సమకూర్పుమని రాజకుమారి యల్లాను ప్రార్థించుచుండును. ఈ వైద్యకుమారుని హస్త మమృతహస్తమనియు, ఇతఁ డిచ్చెడి యౌషధము సంజీవి యనియు గుల్ నారి తల్లిని బ్రోత్సహించుచు, రోగనివార

ణమునకు దోహదములగు ధైర్యవిశ్వాసములను రాణి హృదయమునఁ బాదుకొల్పెను. ఇవ్విధమున శ్రీనాథుని యెడ సదభిప్రాయ సద్భావములు ఆయంతఃపుర సీమ నల్లుకొనియెను.

ౙ

శ్రీనాథుని పేరిపుడు సంస్థానమునం దెల్లెడలను వ్యాపించెను. చిరకాల వ్యాధిపీడితయగు జులెఖకారాణి తొలకరివానకుఁ దెప్పిఱిలు పూలమొక్కవలె కలకఁ దేఱెను. నవాబు ఉత్తరువు ననుసరించి యన్ని సదుపాయము లీచిన్న వైద్యునకు సమకూరెను. సూర్యోదయ మగు నప్పటికి పూజకు వివిధజాతులపుష్పములు,పత్రములును రాజపుత్రిక స్వయముగ కోటనుండి పంపుచుండును. అన్నిటికంటె శ్రీనాథునికిఁ బ్రియమగుపూవు పేరులేని యాయెఱ్ఱనిపూవె. ఆ పుష్పమునకు తనప్రేయసియగు గుల్ నారికిని అవిప్రకు మారుఁడు సామ్యము గలిపించుకొని సంతసించుచుండును! ఆపూవుపేరు పన్నీరుపూవని వానికిపుడు తెలిసెను. గుల్ నారి మోవిచెక్కులు, పదపాణితలములు, పన్నీరు పువ్వును బోలియుండుటచేత, ఆసుందరిని పన్నీరుపువ్వని యా నరసుఁడు తన మనమున వ్యవహరించి, ముద మందుచుండును! దేవుని పూజలకును శ్రీనాథునికి పన్నీరు పూవులే ముఖ్యమయ్యెను. పన్నీరుపూల నెత్తావుల నాఘ్రాణించుట వాని కెంతో సంతోషజనకము. అతని కన్నులను నేదదేర్చునది పన్నీరుపూవు. పన్నీరుపువ్వును గుఱించి యతఁడు పగలంతయుఁ దలపోయును, రాత్రులంతయు కలలు గాంచును! పురుషార్థములు, ముక్తిమోక్షములు శ్రీనాథునికి పన్నీరుపూవె! ఆకుసుమమె, ఆకుసుమకోమలియె, ఆప్రియునికిఁ గల్పతరువు. అతనికి స్వర్గముఁ, సర్వమును, పన్నీరుపూవె!

ఒకనాఁడు శ్రీనాథుఁడు స్వవిషయ విమర్శన మొకింత సలిపెను. అతఁ డీ పరదేశము వచ్చి కొన్ని మాసము లైనది. దైవానుగ్రహమువలన, తాను వచ్చిన కార్యము సఫలమగుట సత్యమె. కాని, యొరుల వ్యాధి నివారణఁ జేయ వచ్చిన తానె యనివార్య వ్యసనపీడితుఁడగుట యెంత శోచనీయము! పరదేశమందలి మక్కువచేత స్వస్థలమును మఱచెడి మందుఁ డెచటనైనఁ గలఁడా! తనకు ప్రేమాస్పదులగు ప్రాఁతబందుగులను వీడి, క్రొత్త చుట్టములకై పరితపించుట యెట్టివెఱ్ఱి! మోహము వివేకము నడంచును. సత్కులసంజాతుఁడగు తా నీయవన జవ్వనిమీఁద వలపు గొనుట యెట్టి యవమానము! ఎంత యసభ్యము! అన్యజాతి మత సంప్రదాయములతో



"పన్నీరుపూల నెత్తావుల నాఘ్రాణించుట......సంతోషజనకము"

నొప్పెడి యాముస్లిము రాజకన్యక వైద్యవృత్తి జీవనము గాఁగల యొక విదేశ బ్రాహ్మణపుత్రకుని బ్రేమించి, యాతని పాణిగ్రహణ మొనర్చునా? అందని మ్రానిపండ్లకఱ్ఱులు సాఁప నేల?వచ్చినపని ముగించి, బహుమతి నంది, యింటి కేగి, తా నేల కృతార్థత నొందఁగూడదు?

శ్రీనాథునికి రాచకన్నియ మీఁది ప్రేమము ఆత్మవిమర్శనము, ఆత్మబోధనము లను సాధారణ చికిత్సా సాధనముల నతిక్రమించిన కఠినవ్యాధిగఁ బరిణమించెను! వలపు ప్రాణమునే లెక్కసేయనపుడు, వ్యక్తిలక్షణము

లగు కులజాత్యభిమానములు, అజ్ఞావమానములను పరిగణించునా? సంసారబంధములు కోసివైచిన విరాగివలె నీప్రియుఁడు ఏకాగ్రచిత్తుఁడై, ప్రేమాధినాథుని కంజలులు సలుపుచు, దినములు పుచ్చుచుండెను. అవిప్రవృత్తకుని కాముస్లీము రామాస్మరణమె రామస్మరణ మయ్యెను! ఆసుందరి దినదినము ప్రాతస్సమయమున తన మృదుకరములఁ బ్రీతితోఁ గోసి యంపెడి పన్నీరుపూవులె యా ప్రియుని కమూల్యములగు కానుకలు, ఆతని యిష్టదైవమున కభీష్టమగు పూజాద్రవ్యములును!

౬

ఇంక రాజగృహమునందలి గుల్‌నారిని గూర్చిన సమాచారములు పరికింపవలయును. ఏకైక పుత్రిక యగుటచేత గుల్‌నారి జననీజనకుల కన్నులకు పెన్నిధియె! భువనమోహిని యగు పుత్రికయందు మాతాపితరుల కమిత వ్యామోహ ముండుట యాశ్చర్యము గాదు. ఆ బాలయందుఁ గాన వచ్చెడి సుగుణసౌశీల్యములు వారి ప్రేమవృక్షమునకు దోహదము లయ్యెను. అసమాన బుద్ధిచాతుర్యముతో భాసిల్లెడి యాబాల, జనకుని వేదాంత ప్రసంగములందు పాల్గొనుచుండును. గుల్‌నారి సాడీ మున్నగు పారసీక కవిపుంగవుల కావ్యరాజములు చదివి, అందలి మనోహరభావములను గూర్చి జననితో ముచ్చటించుచు, నిరతము యవనకవితా సుధారసము నాస్వాదించుచుండును. పారసీక కవులు వలచి వర్ణనలందు గుప్పించిన గులాబి పూవులను ప్రియ తనయకుఁ జూపించుటకె నవాబు పారసీకమునుండి గులాబియంటులు తెప్పించి, ఉదయగిరిని నాటించెను! ఆ మొక్కల సంరక్షణభార మీ సుందరి మీఁదనే యుండెను. హిందూ దేశీయు లనాదిగ పెరిషియానుండి వచ్చెడి గులాబిపూలసారమగు పన్నీరు వాడుచుండెడి వారు కాని, ఆ కుసుమముల దర్శనభాగ్య మిదివఱ కెఱుఁగరు! కావుననే యిపుడు ఉదయగిరి మీఁద విరివారు నీ క్రొత్త జాతిపూవులను దేశీయులు పన్నీరు పూవులని వ్యవహరింపఁ దొడంగిరి. నెల్లూరుసీమ వారు నేఁటివఱకును గులాబి పూవులను పన్నీరు పూవులనియె పేర్కొనుచుందురు. ఆ పూఁబోదలను ప్రప్రథమమునఁ బెనుచుచుండిన యా రాచకన్నియకు "పన్నీరుపువ్వు" అని జనులు పేరిడిరి. గుల్‌నారి యను పారసీక నామమునకు నిదియె యర్థ మగుటచేత, అన్నివిధముల నా రాజకుమారికి "పన్నీరుపువ్వు" సార్థకనామ మయ్యెను.

పొదరిండ్ల పొంచుచును, పూఁడీఁగలఁ జక్కఁజేయుచును, సతతము కుసుమములతోఁ గాలము గడపు గుల్‌నారిని మధులిహమను ముద్దుపేర తండ్రి పిలుచుచుండువాఁడు. గుల్‌నారి విద్యాబుద్ధులం దాఱితేఱిన వయస్యయైనను, తలిదండ్రుల కింకను బాలికయె! తాను బాలననియె యా తరుణియు తలంచుచుండును! కాని, కష్టానుభవము, కాముని ప్రబోధనమును ఎట్టి లేఁబ్రాయపు వారికిని వయసు గొనివచ్చును! ప్రేమమూర్తి యగు జనని చిరకాలవ్యాధి గుల్‌నారికి వ్యాకులతతోపాటు ప్రాయమును బెంచెను. యావన వైద్యుని చికిత్సచే తల్లి స్వస్థత నొందుటకు పుత్రిక యపరిమితముగ సంతోషించెను. ఆ యువకుఁ డసమానబుద్ధి ప్రజ్ఞలతో నొప్పువాఁడని వానిని జూచినపుడె గుల్‌నారి గ్రహించెను. ఆతని మూలమునఁ గదా జనని జీవములు దక్కెనని యా రాచకన్నియ వైద్యునెడ మితి లేని కృతజ్ఞత గలిగి యుండెను. సుగుణాన్వితుఁ డగు నా సుందర పురుషునం దా సుదతికిఁ గుదిరిన సద్భావము వట్టి కృతజ్ఞత గాదు. ఆ యువకుని తన హృదయాధినాథునిగ గుల్‌నారి భావించెను! ఐనను, తన మన మిట్టి తలంపులకు లోనగుట బాల్యలక్షణమని యా తరుణి యొక్కొకతఱి తలపోసి, తనకుఁగల విద్యావివేకానుభవముల సాహాయ్యమున నద్దాని హసించి నిరోధింప యత్నించెను. కాని, ప్రేమాంకురము తనహృదయక్షేత్రముల తలసూపఁగనె వేఱు తన్నిన వృక్ష మగుట కా యువతి విస్మయ మందెను! నూతనప్రేమ వ్యాజమున నిట్లు గుల్‌నారి వయస్స్థ యయ్యెను!

కుశాగ్రబుద్ధిగల గుల్‌నారి ఈ నూతనపాశమును ద్రుంపివేయ నెన్నిప్రయత్నములో చేసెను. తనకును బ్రియు

నీకినిజాతిమతసాంఘికాచార విషయములఁగల వ్యత్యాసములను దలపోసెను. జననీజనకుల యనుమ్మతినిగూర్చి యోజించెను. లోకుల వ్యాఖ్యానము లూహించెను. తన ప్రేమ సాఫల్యమునకు లోకమంతయు నడ్డుపడునట్లుగ భావించెను. ఐన నీప్రతిబంధకము లన్నియు దాఁటి వెడలి, అసుదతి హృదయమందలి ప్రేమలతిక తల యెత్తి యాకసమంటునట్లు గానవచ్చెను! మంకుపట్టుపట్టిన పసిపట్టివలె నా పడఁతి ప్రేమశిశువు మాతృహితబోధనలు పెడచెవిని బెట్టుచుండును! గింజుకొనినకొలఁది కంఠము బిగియించు నురిత్రాటివలె, తొలఁగింపవలెనని యత్నించిన కొలఁది ప్రేమపాశము హృదయమును బంధించుట కావనిత వనటఁజెంది, చేయుట కేమియుఁదోఁపక, చేష్టలు దక్కియుండెను!

చేతనములకెల్ల చైతన్యమగు ప్రేమమునకు పెనుపు నైసర్గికలక్షణము. జనకుని యానచే ననుదినము క్రొత్తవైద్యుని పూజలకు పన్నీరుపూవు లంపెడి గుల్‌నారి, ఒకనాఁడు, తన ప్రణయవృత్తాంతము ప్రియునికిఁ దెల్పియాతని మన మెఱుంగఁ గోరి, తాను వ్రాసిన చిన్నకమ్మ చుట్టును పూ లమర్చి బంతికట్టి, దానిని పూలలో నిమిడ్చి, పూలగంప నెప్పటివలె వైద్యుని విడిది కంపెను! పూవుల కెదురుచూచుచుండు శ్రీనాథుఁడు, పూలమధ్య నుండు పూబంతి చూచి విస్మయ మంది, తనగుండియ లాత్రమునఁ గొట్టుకొనుచుండఁగ, అది మెల్లనవిప్పెను. లోనిలేఖ చూచి చదువుకొనునపుడు, అప్రియుని హృదయ మీలోకమున లేదు! ఏవిచిత్ర ప్రపంచముననో, ఏకల్పతరువుల నీడనో, తాను విశ్రమించుచు, సుందర పక్షిజాలముల కిలకిలారావములు వినుచుండునట్లుగ నాయువకునికిఁ దోఁచెను! లేఖా విషయము లెవ్వి? ఆయువకన్యకమీఁద మది నిలుపుటచే తనకు లోక మెంత శోభాయమానముగ నున్నదో, తననుగూర్చియె తలంచుచు ప్రొద్దు పుచ్చుచుండుటచే నాతరుణికి నటులె యుండెను! కదళికావనమున సేవకులు కోసి కోటకుఁ గొనిపోయెడి ఫలపత్రముల మధ్యమున తన ప్రత్యుత్తరపు ప్రేమలేఖను బొందుపఱచి, విప్రకుమారుఁడు గుల్‌నారి కంపెను. ఈవిధమున నాయువతీ యువకుల ప్రేమానురాగములు పెంపారుచుండెను!

౨

సౌఖ్యదినములు క్షణములై సాగిపోవును. తాను వచ్చిన కార్యము దైవానుగ్రహమున సఫలమై రాణి సంపూర్ణారోగ్యము గాంచెఁ గావున, రాజానుమతి నైనచో, తాను బోయి వచ్చెదనని శ్రీనాథుఁడు నవాబునకు విన్నవించుకొనెను. మఱునాఁడు ప్రభువు నిండుకొలువున నుండి, శ్రీనాథు నుచితాసనాసీనుం జేసి, అతని వైద్య నైపుణ్యమును బ్రశంసించెను. మంత్రులు వానినెంతో శ్లాఘించిరి. వయసునఁ జిన్న యయ్యును, విద్యాప్రాభవముల నీతఁడు పెద్ద యనియు, వైద్యరహస్యములీతనికివలె నింకెవ్వరికి నెఱుకపడవనియు, కావున నేలికయొసంగెడి యెంతటి గొప్ప పారితోషికమును స్వీకరించుటకైన నీ యువకుఁ డర్హుఁడనియు ఆస్థానవైద్యవేత్త యుపన్యసించెను. తనమీఁద నుదయగిరి వారికిఁ గల యపారకరుణయె తన జయమునకుఁ గారణము గాని, ఇతర వైద్యులకు లేని ప్రజ్ఞాతిశయము తనయందు లేదని శ్రీనాథుఁడు సవినయముగఁ బ్రత్యుత్తర మిచ్చెను. అంతట నవాబు శ్రీనాథునిచేత నొక గులాబిపూవు నుంచి, బంగరు పళ్లెరమున నుండిన వరహాలరాశి వాని కొసఁగఁబోయెను. తాను సువర్ణము తాఁకననియు, తన కష్టమున కొక పన్నీరుపూవె చాలు ననియు నా యువకుఁడు రాజునకు విన్నవించెను! గొప్ప బహుమతి వలదనెడి యిట్టి పెడఁగు లెందైన నుండునాయని పలువు రాశ్చర్య మందిరి. అద్దంకి సీమవారు సత్యకాలపువారని కొందఱును, బహుమతి చాలదని నవాబునకు నచ్చఁ జెప్పుటకె యీగడుసరి యిట్లు చేసెనని మఱికొందఱును అనుకొనిరి. అంతటితో సభ గలసెను.

వైద్యయువకుని యుద్దేశము నవాబున కేమియు బోధపడకుండెను. ఆయన యొకటి నిర్ధారణచేసికొనెను. ఇంత ధైర్యముగ మెలఁగనేర్చిన వాఁడు మిగుల యోగ్యుఁ

డైనను, అత్యాశాపీడిత హృదయుఁడైనను గావలయును! ఫలాపేక్షావిరహితులగు వేదాంతులకు ధనకాంక్షానిరోధ మెంతటిపని? ఒకవేళ నీతని మనసు అధిక ధనస్వీకారమునందె మగ్నమైన దనుకొన్నను, ఇంతటి మేలు చేసిన వైద్యుని కష్టము ప్రభువు లుంచుకొనుట న్యాయమా? కావున నిండుసభలోనికిఁ గాక, యీమా అంతఃపురమునకు రప్పించి, రహస్యముగ నభిప్రాయము గనుఁగొని, వాని ఋణము దీర్చివైచి, తాను కృతకృత్యత నొందవలెనని నవాబు ఉద్దేశించెను.

౨

ప్రభునాజ్ఞ ననుసరించి శ్రీనాథుఁ డామఱునాఁడు నగరున కేతెంచెను. రాణి పానుపున కడ్డముగఁ దెరవేయఁబడి యుండెను. నవాబు కాంచనవేదికపైఁ గూర్చుండి శ్రీనాథుఁడు తనకుఁ జేసిన సలాము లందుకొని, కురిచీలో నాతనిఁ గూర్చుండఁబెట్టెను. వెనుకటికంటె నెక్కువగ పసిఁడి నాణెములు పళ్లెరమునఁ దళుకొత్తుచుండెను. అపుడె వికసించిన యొక పెద్ద గులాబిపూవు సువర్ణరాశిపై సొబగొందుచుండెను. రాజ్ఞీ రాజపుత్రికలు తెరవెనుక నాసీనలై యుండిరి. ఆదెసనుండి తెరలు తెరలుగ వీతెంచు పూల నెత్తావులును, కాంచన కంకణముల కలస్వనములును ఆసుందరు లీసభాకార్యక్రమము నతి కౌతుకాయత విలోచనముల విలోకించుచుండిరని ప్రకటనము చేయుచుండెను!

ప్రథమమున ప్రభువు కొన్ని యుపోద్ఘాత వచనములు పలికెను. శ్రీనాథుఁడు తన కుటుంబమునకొనర్చిన మహోపకార మాతఁ డుగ్గడించి, తన కృతజ్ఞతాసూచక మగు నీచిన్ని కానుకను గైకొని తనను గౌరవింపుమని యాయువకుని వేఁడెను. శ్రీనాథుఁడు వినయపూర్వకమగు వినతు లొనర్చి తన హృదయము కాంచనరత్నములఁ దగిలియుండ లేదనియు, దేవరకు సమ్మతమయ్యెనేని తన వలపులకొలికియగు నొక పన్నీరుపూవె చాలుననియు విన్నవించెను! ఈ చిన్ని కోరికకు రాజు, రాజ్ఞియు నద్భుతమందిరి. ఆశ్చర్యలగ్న మానసులు గానివారు వక్తయు, నాతని కలుముల రాణి యగు రాజకన్యకయును!

తురుష్క ప్రభువు ధీశాలి; ధీరోదాత్తుఁడు. విప్రపుత్రకుని పలుకులకు ఆమహనీయుని మనమున తొలకరి మెఱుపువలె నిపుడొక యోజన స్ఫురించెను! వైద్యునచటనె కూర్చుండుమని చెప్పి, రాజు చట్టన తెరలోనికిఁ బోయి, రాణితోఁ గొంత ముచ్చటించి, పిమ్మట పుత్రికతో సంభాషించి, తెరవెలుపలకు వచ్చి, "యువకుఁడా! నీబుద్ధికుశలత మేలైనదని మున్నె యెఱింగితిని. ఇపుడు నీధైర్యము ప్రశంసనీయమని తేలినది. మఱియేజేని మ్రోలనేని, నీసాహసమునకు నీశిరసె సమాధాన మీయవలసి యుండెడిది! నామనస్సునకు మాత్రము సత్యధర్మములె ముఖ్యములు గాని క్షణభంగురములగు జాత్యభిమానములు గావు. నీప్రణయచరితము నిక్కువ మైనచో, ప్రేమ సత్యములకు పెనుఁగొమ్మయగు పరమాత్ముఁడు నిన్నాశీర్వదించుఁ గాక! నీ కోరికను మరలఁ దెలిపెదవా?

"దేవర వారికి నాయం దనుగ్రహ మున్నచో, నాకు పన్నీరుపూవు ప్రసాదింపవలయును!" అని శ్రీనాథుని ప్రత్యుత్తరము.

రాజు: "పన్నీరుపూవు మాకు ప్రియము, పవిత్రము నైనది! అద్దాని నీవు శయనగృహాలంకరణమునకే కాక, దేవతామందిరమునఁ గూడ గౌరవించెదవా? లలితకళా జన్మభూమి యగు పారసీకోద్యానములందును, ఆధ్యాత్మికవిద్యారహస్యములగు సుఫీదేవాలయ ప్రాంగణములందును ప్రభవించిన యీపూవుఁ దీఁగె పవిత్రవేద భూమి యందు వర్ధిల్లఁగలదని అంటు గట్టుట కనుపఁబడుచున్నది సుమీ!"

వైదికసంస్థాపకుఁ డగు నాశ్విప్రకుమారుని ప్రేమమున కిది క్లిష్టమగు సమస్య! ఐన దీని కాతఁ డొసఁగు సమాధానమును బట్టియె ఆతని ప్రేమమునకుఁ గల ధైర్యస్థైర్యములు తేటపడఁగలవు. ఇపు డతఁడు ఆవంతయుఁ గొంకక, "మహాప్రభూ! సత్యసంధత యనుశ్రుత

ముగ నుండెడి భగవద్భక్తుల వంశ్యుఁడనేని, పన్నీరు పువ్వును తగిన చోఁప్పున మన్నించి, ఎన్నఁటికిని వన్నెమాయన్ని విధమునఁ గాపాడఁగలను!" అని ప్రత్యుత్తర మిచ్చెను

అంత నవాబు దిగ్గన లేచి, ఒఱలో వ్రేలాడు కాంచన ఖడ్గము దీసి, "హృదయము కలిసిన చోటుల వదిలము లెందుకు?" అని పలికి, తెరనొక్క వ్రేటునఁ జీల్చి, "హృదయేశ్వరీ! మన ప్రాణసమానయగు పుత్రిక పన్నీరు పూవునకు తగినవరుఁ డీవైద్యకుమారుఁడె సుమీ! దేవుఁడు ప్రీతితోఁ గలిపిన హృదయములు వేరుచేయుటకు మనుష్యమాత్రులము మన మెవ్వరము? స్వాంతము సత్యధర్మములందున్న సచ్చారిత్రులై స్వచ్ఛమగు ముసల్మానులు! బిస్మిల్లా! వీరి దాంపత్యము దైవసమ్మతము!" అని వక్కాణించెను.

అంత నా యువతీ యువకులు రాజ్ఞీ రాజులకు మ్రొక్కి, వారి దీవనలతో గృహస్థాశ్రమస్వీకారముచేసిరి!

౯

కందుకూరు సీమలో పశ్చిమదిగ్భాగమున కమలూరను గ్రామము గలదు. అందు క్రొత్తగ నొక బ్రాహ్మణ కుటుంబము వచ్చి కాఁపురముండెను. ఏప్రభువు ప్రాపక మునవో వారికి గొప్పభూవసతి ప్రాప్తించెను. గృహస్థుఁడు వైద్యశిఖామణి; గృహిణి అప్సరసవంటి శరీరసౌందర్యమున నొప్పునది. దేశభాష బాగుగ రాకుండుటచేతనో, మఱి యేకారణముననో ఆగర్భశ్రీమంతురాలగు నాయిల్లాలెప్పుడు నిల్లు విడిచియుండునది కాదు. ఐనను, రూపగుణాధిక్యమున నాకోమలి దేవతావిగ్రహమె! పూలమొలకలు పెంచుటయం దాసుందరి కెంతయు నాసక్తి. ఆపడఁతిపేరు పన్నీరుపువ్వు. వారి సంతతివారు పన్నీరుపూలవంటి శరీర సౌందర్యమువనొప్పుచు, భక్తినిరతత్వమునకును, లలితకళలం దభిరుచికిని వాసికెక్కి యున్నారు.

౧౦.

కమలూరు గ్రామమందును, చుట్టుప్రక్కల నైదాఱు గ్రామములందును ఇప్పటికిని "శ్రీనాథము" అను నింటిపేరు గల గొప్ప భూస్వాము లున్నారు. ఇచటఁ దప్ప దేశమం దెచటను శ్రీనాథమువారు లేరు. మొట్టమొదట కొన్ని యనుమానములచేత ఆ వంశికులను తక్కిన బ్రాహ్మణ సంఘమువారు, కొంత తక్కువగఁ జూచిరఁట గాని, శ్రీనాథమువారి కిపు డట్టి బాధలు లేవు. సోముఁడు వారి యిష్టదేవత. స్త్రీ పురుషులు లలాటమందలి బొట్టు మీఁద బాలచంద్రరేఖ నలంకరించుకొందురు. వింతయగు నొక చాంద్రాయణ వ్రతము వారు జరుపుచుందురు. మహమ్మదీయులయెడ వీరు అత్యంత సోదరభావము గలిగి యున్నారు. ఈవంశమున పలువురు కవిత్వధోరణికిని, లలిత కళాభిరతికిని ప్రసిద్ధి కెక్కియున్నారు. సమధిక నిష్ఠకును, శరీరసౌందర్యమునకును శ్రీనాథము వారు పేరుపడియున్నారు!

[ఈ యైతిహ్యము నందలి ముఖ్యాంశములు స్పెయినుదేశీయుఁ డను జోసెఫ్ వెంజిగ్ అను హిందూదేశచరిత్ర పరిశోధకుని దినచర్య పుస్తకమునుండి గ్రహింపఁబడినవి.]